## ప్రసూతి మరణాలు

ప్రసూతి మరణాలతో భారత్ 2023లో ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉంది. దేశంలో సగటున ప్రతిరోజు 52 చొప్పున మొత్తం 19 వేల ప్రసూతి మరణాలు నమోదయ్యాయి. 75 వేల మరణాలతో నైజీరియా మొదటి స్థానంలో నిలిచింది. పాకిస్థాన్ 11 వేల మరణాలతో మెరుగైన స్థితిలో ఉంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ, యునిసెఫ్, యూఎన్ పాపులేషన్ ఫండ్ తదితర సంస్థలు రూపొందించిన ఈ నివేదికను ఏప్రిల్ 9న విడుదల చేశారు. ఈ నివేదిక ప్రకారం 2023 ప్రపంచ వ్యాప్తంగా నిమిషానికి సగటున 2.6 లక్షల మంది మహిళలు గర్భ, ప్రసవ సంబంధిత ఇబ్బందులు, వ్యాధులతో మరణించారు.

# చిన్ననాటి కల.. తల్లిదండ్రుల ప్రోత్సాహం..

11వ ర్యాంక్

**చిన్నప్పటి నుంచే కలెక్టర్ కావాలని కలలకన్నారు. అందుకు తల్లిదండ్రులు కూడా ప్రోత్సహించారు. మొదటి ప్రయత్నంలో ఫెయిలైనా పట్టుదలతో చదివి అనుకున్న లక్ష్యం నెరవేర్చుకుంది ఇట్టబోయిన సాయి శివాణి. సెల్‌ఫోన్ కూడా వాడకుండానే ఆమె ఈ ఘనత సాధించింది. విజయ ప్రస్థానం ఆమె మాటల్లో తెలుసుకుందాం..**



### కుటుంబ నేపథ్యం

- మాది ఖిలావరంగల్‌లోని శివనగర్. తల్లిదండ్రులు ఇట్టబోయిన రాజు, రజిత. నేను మొదటి కూతురిని. సోదరి సరయు సఖి హైదరాబాద్‌లో సీఏ చదువుతుంది. సోదరుడు సాయిశివ హైదరాబాద్‌లో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. నాన్న మెడికల్ రిప్రజంటేటివ్ కావడంతో ఉద్యోగరీత్యా పదేళ్లు ఖమ్మంలో ఉన్నారు. నా బాల్యం మొత్తం ఖమ్మంలోనే గడిచింది. బాల్యం నుంచే కలెక్టర్‌ను కావాలనే కలకు అమ్మానాన్న కల తోడైంది. వారి ప్రోత్సాహంతోనే సక్సెస్‌గా నిలబడగలిగాను.

### విద్యాభ్యాసం

- ఖమ్మంలో స్థానికంగా ఉన్న పాఠశాలలో 1 నుంచి 10వ తరగతి వరకు విద్యనభ్యసించాను. పదో తరగతిలో 10/10 రావడంతో ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చింది. అక్కడే ఇంటర్, బీటెక్ పూర్తి చేశాను. చిన్ననాటి నుంచే కలెక్టర్ కావాలనే కల ఉన్నప్పటికీ బీటెక్‌లో ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ పూర్తి చేశాను. సివిల్స్ కోసం ఆంత్రపాలజీ సబ్జెక్ట్‌ను ఎంచుకున్నాను. ఆంత్రపాలజీ మానవీయ కోణంలో ఉన్న సబ్జెక్ట్ కాబట్టి చదువుతుంటే కొత్తగా అనిపించడంతో ఇష్టంతో చదివాను.

### కలెక్టర్ విధులు, సేవలు నచ్చి..

- బాల్యంలో ఇంటిలో నాన్న టీవీలో న్యూస్ చూసేవారు. ఇంటిలో సినిమాలు, సీరియళ్లు పెట్టేవాళ్లం కాదు. న్యూస్ చూస్తున్నప్పుడు, పత్రికలు చదువుతున్నప్పుడు కలెక్టర్ల విధులు, ప్రజలకు చేస్తున్న సేవలు నచ్చాయి. ఇదే విషయాన్ని అమ్మానాన్నతో చెబితే అప్పటి నుంచే జీకే ప్రశ్నలు అడుగుతూ ఆవైపు ఆసక్తిని కలిగించారు. అలా మొదలైన ఆసక్తి బీటెక్ తర్వాత 2023లో మొదటిసారి సిలిల్స్ రాయగా ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణత సాధించలేకపోయాను.

### శ్రమ, ప్రేరణ

- సివిల్స్‌లో ర్యాంక్ సాధించడానికి చాలా కష్టపడ్డాను. చిన్ననాటి నుంచి మొబైల్ ఫోన్ ఉపయోగించలేదు. హాస్టల్‌లో ఉన్నప్పుడు హాస్టల్ ఫోన్, ఇంటికి వస్తే నాన్న ఫోన్ అది కూడా సబ్జెక్టుల్లో సందేహాలు వస్తే నివృత్తి చేసుకోవడానికే ఉపయోగించాను. కోచింగ్ సెంటర్లకు వెళ్లకుండా సొంతం గా నోట్స్ తయారు చేసుకున్నాను. మొదటిసారి ప్రిలిమ్స్ ఫెయిల్ కావడంతో మానసికంగా ఇబ్బంది పడుతున్న క్రమంలో అమ్మానాన్న వెన్నుతట్టి ధైర్యం చెప్పి ప్రోత్సహించారు. సివిల్స్‌లో ర్యాంక్ వచ్చే వరకు ఎలాంటి ఉద్యోగం కూడా చేయొద్దని, డిప్రెషన్‌లోకి వెళ్లకుండా ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు చేశారు. రెండో ప్రయత్నంలో ఆన్‌లైన్‌లో సత్యం జైన్ గైడెన్స్‌తోపాటు ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్స్ ఫాలో అయి 2024 సివిల్స్‌లో 11వ ర్యాంక్ సాధించాను. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్–1లో 21వ ర్యాంక్ వచ్చింది.

### అభ్యర్థులకు సూచనలు, సలహాలు

- సివిల్స్ సర్వీసెస్‌లో చేరాలనుకునే యువత హార్డ్ వర్క్ చేయాలి. లక్షల మంది పరీక్ష రాస్తారు. అలాంటిది నాకు ర్యాంక్ వస్తుందా అనే అనుమానాలను, నిస్సహాయ, నిస్పృహలకు చోటు ఇవ్వకూడదు. అలాగే సోషల్ మీడియాకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిది. పత్రికలు, టీవీల్లో వచ్చే వార్తలను చూడాలి. ప్రణాళికాబద్ధంగా రోజు కు సుమారు 8 నుంచి 12 గంటలు చదివితేనే ర్యాంక్ వస్తుంది. సివిల్ సర్వెంట్‌గా ఏ రంగంలోనైనా పని చేస్తాను. ముఖ్యంగా ఆదివాసీలు, అణగారిన వర్గాలకు సేవ చేయాలనేది సంకల్పం.

### ఇంటర్వ్యూలో అడిగిన ప్రశ్నలు

- ఇంటర్వ్యూలో అడిగిన ప్రశ్నలన్నీ కాకతీయుల మీదనే. వరంగల్ నుంచి వెళ్లాను కాబట్టి కాకతీయులకు సంబంధించిన ప్రశ్నలు ఎక్కువగా అడిగారు. రాణి రుద్రమదేవి పరిపాలన దక్షత, గొలుసుకట్టు చెరువులతోపాటు వరంగల్ ఎక్కువగా పండించే పత్తి, మిర్చి పంటలపై అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చాను.

కొత్త రమేష్ (ఖిలా వరంగల్)



### వ్యక్తిగత అనుభవాలు

- తమ కలలే తల్లిదండ్రుల కలలైనప్పుడు జీవితంలో ఏ రంగంలోనైనా రాణిస్తాం అనడానికి మా అమ్మానాన్నలే నిదర్శనం. వారి ప్రోత్సాహం వల్లనే సివిల్స్‌లో 11 ర్యాంక్ సాధించాను. గ్రూప్–1లో భాగంగా మెడికల్ టెస్టు కోసం నాన్నతో కలిసి హైదరాబాద్‌లోని ఉస్మానియా హాస్పిటల్‌కు వెళ్లాను. వైద్యపరీక్షలు పూర్తి చేసుకొని బయటకు వచ్చన తర్వాత సివిల్స్‌లో 11వ ర్యాంక్ వచ్చిందని నాన్న చెప్పాడు. నాది, నాన్నది ఇద్దరిది ఒకే డ్రీం కావడం, అందులో స్వయంగా నాన్నే శుభవార్త చెప్పినప్పుడు భావోద్వేగానికి గురయ్యాను.

# ప్రభుత్వ బడుల్లో చదివింది కలెక్టర్ ఉద్యోగం సాధించింది

**ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివింది. ఇష్టంతో కష్టపడి సివిల్స్‌లో ర్యాంక్ సాధించింది. కర్ణాటకకు చెందిన ప్రీతి విజయం ప్రస్థానమిది. కుటుంబం, చదివిన తీరు ఇతర వివరాలు ఆమె మాటల్లో**

263వ ర్యాంక్



### కుటుంబ నేపథ్యం, చదువు

- మాది కర్ణాటకలోని మైసూర్ వద్ద అంకనహళ్లి గ్రామం. నాన్న రైతు, అమ్మ గృహిణి. నాకు అక్క ఉంది. నా విద్యాభ్యాసం అంతా అంకనహళ్లిలోనే కన్నడ మీడియంలో జరిగింది. బీఎస్సీ అగ్రికల్చర్ కాలేజ్ ఆఫ్ అగ్రికల్చర్, మండ్యలోని వీసీ ఫార్మ్ కాలేజ్ నుంచి 2018లో గ్రాడ్యుయేట్ పూర్తయ్యింది. ఆ తరువాత అగ్రికల్చర్ ఎకనామిక్స్‌లో యూపీలోని బెనారస్ హిందూ యూనివర్సిటీలో ఎమ్మెస్సీ చదివాను.

### కన్నడ బ్యాక్‌గ్రౌండ్ నుంచి తెలుగు రాష్ట్రాల్లో కోచింగ్ తీసుకోవడానికి కారణం?

- 2020లో హైదరాబాద్ వచ్చాను. తెలుగు నేర్చుకు న్నాను. అప్పటి నుంచి 2020, డిసెంబర్ నుంచి కోచింగ్ ప్రారంభించాను. నా ఫ్రెండ్స్ చాలామంది బెంగళూరులో కోచింగ్ తీసుకుంటున్నారు. అక్కడే ఉంటే డిస్ట్రాక్ట్ అవుతానని హైదరాబాద్ వచ్చాను. అంతేకాకుండా హైదరాబాద్ బెంగళూరుతో పోలిస్తే నివాస ఖర్చులు చాలా తక్కువ.

### ఎన్నో అటెంప్ట్‌లో సాధించారు? ప్రిపరేషన్ ఎలా సాగింది?

- ఇది మూడో అటెంప్ట్. మొదటి రెండు సార్లు (2020, 2023) ప్రిలిమ్స్ పాస్ కాలేదు. అయినా నిరుత్సాహ పడకుండా మూడో ప్రయత్నంలో 263వ ర్యాంక్ సాధించాను.

### ఈ ప్రయాణంలో ఎదురైన అనుభవాలు?

- గ్రాడ్యుయేషన్ నుంచి హాస్టళ్లలోనే ఉంటున్నాను. కాబట్టి తల్లిదండ్రుల నుంచి దూరంగా ఉండటం అలవాటై పోయింది. దీనికంటే మా గ్రామస్థులు, చుట్టాలు నాన్నతో 'ఎందుకు ఆడపిల్లను అంతదూరంలో చదివించడం, పెళ్లై వేరే ఇంటికి వెళ్లి పోయేదానిపై ఇంత ఖర్చు అవసరమా' వంటి ప్రశ్నలు నాన్నను అడగటం నన్ను బాధపెట్టాయి.

### నాన్న ఇచ్చిన ధైర్యంతో..

- కొన్ని ఆర్థిక ఇబ్బందులు వచ్చినా నాన్న వాటిని నా వరకు రానివ్వకుండా నాకు ఎంతో సపోర్ట్ ఇచ్చి ఆ బాధను తానే మోసి నన్ను మోటివేట్ చేస్తూ వచ్చారు. నాన్న ఇచ్చిన ధైర్యం వల్లనే సివిల్స్ సాధించగలిగాను.
- సివిల్స్ రెండుసార్లు ప్రిలిమ్స్‌లో విఫలంతో నాబార్డ్, ఇతర బ్యాంక్ పరీక్షలు రాశాను. అవి రాకపోవడంతో ఎలాగైనా సివిల్స్ సాధించాలని పట్టుదలతో ప్రయత్నించి సాధించాను. బ్యాంక్ పరీక్షలు పాసై ఉద్యోగం వస్తే సివిల్స్ సాధించే అవకాశం ఉండేది కాదు.

### మీ విజయంపై గ్రామస్థుల స్పందన?

- సాధారణ గ్రామస్థురాలిగా హైదరాబాద్ కోచింగ్‌కు వచ్చిన నేను ఇప్పుడు ఐఏఎస్ అధికారిగా తిరిగి వెళ్లడం చాలా గర్వంగా, ఆనందంగా ఉంది. మా ఊరివాళ్లు, బంధువులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నా విజయాన్ని తమ విజయంగా భావించి బ్యానర్లతో స్వాగతించడానికి సిద్ధంగా ఉన్నారు. మా ఊరి నుంచి సాఫ్ట్‌వేర్, ఇతర ఉద్యోగులున్నారు. కానీ ప్రభుత్వ ఉద్యోగులు లేరు. తొలి వ్యక్తిగా నేను నిలవడం చాలా గర్వంగా ఉంది.

### సివిల్స్ వైపు రావడానికి కారణం?

- 2018 బ్యాచ్ ఐఏఎస్ హిమాన్షు నాగ్‌పాల్‌ను చూసి స్ఫూర్తి పొందాను. ఆయన కూడా చాలా ఉదార స్వభావం గల వ్యక్తి. తప్పిపోయిన పిల్లలను తిరిగి తమ తల్లిదండ్రులకు చేర్చడం ఆయన చేసిన పనుల్లో బాగా ఆకట్టుకుంది. అదేవిధంగా 2012లో అంకనహళ్లి గవర్నమెంట్ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతు న్నప్పుడు ప్రిన్సిపల్ ప్రదీప్‌కుమార్ 9 టు 5 ఉద్యోగాలు ఎన్నాళ్లు? ఎవరికోసం? సమాజానికి ఉపయోగపడే ఉద్యోగం చేయాలని చెప్పేవారు. దీంతో ఐఏఎస్ కావాలని నిర్ణయించుకున్నాను.

### కోచింగ్ ఎక్కడ తీసుకున్నారు? ఆప్షనల్ సబ్జెక్ట్ ఏంటి?

- ఎక్కడా కోచింగ్ తీసుకోలేదు. ఆప్షనల్ ఆంత్రపాలజీ కోసం యూట్యూబ్ ద్వారా సోసిన్ ఐఏఎస్ అకాడమీ పాఠాలు విన్నాను. ఇంకా వివేకానంద సార్ ఏఆర్‌కే రిఫ్లెక్షన్ అకాడమీ సలహాలు, సూచనలు తీసుకున్నాను. బలాలు ఏంటి? ఎక్కడ, ఏ అంశాల్లో వెనుకబడి ఉన్నాను, ఎలా మెరుగుపరుచుకోవాలని ఆయన గైడ్‌లైన్స్ ఇచ్చారు. ఆంత్రోపాలజీ తీసుకున్న చాలా మందికి ర్యాంక్స్ వచ్చాయి. అందుకే ఆంత్రోపాలజీ తీసుకున్నాను.

### ఏం చేయాలనుకుంటున్నారు?

- నిరుద్యోగితపై దృష్టిసారించి స్కిల్ డెవలప్‌మెంట్ వంటివి, వ్యవసాయ రంగానికి కావాల్సిన కృషి చేస్తాను.

### ఇంటర్వ్యూ చేసిన బోర్డ్ ?

- బీబీ స్వెయిన్ బోర్డ్ ఇంటర్వ్యూ చేసింది. సుమారు 30–40 నిమిషాలు కొనసాగింది. మాక్ ఇంటర్వ్యూలు కొంతవరకు ఉపయోగపడినా.. మెయిన్ ఇంటర్వ్యూ భయం లేకుండా ఇంట్లోని పెద్దలతో కూర్చొని చర్చించినట్లు భావన కలిగింది.

అవసరాల సాయీశ్వర్